సాక్షి ఖమ్మం

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



ఓసీకి ఓకే !

ఇల్లెందులో జేకే ఓసీ ఏర్పాటుకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సాఫీగా జరగగా, అందరి నుంచి సానుకూలత వ్యక్తమైంది. 8లో



రామయ్యకు రెండు వాహనాలు

భద్రాద్రి రామచంద్రస్వామికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఇత్తడితో చేయించిన రెండు గరుడ వాహనాలు సమర్పించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 37° / 24°

గురువారం జిల్లాలో ఉక్కపోత వాతావరణం ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

రెండో రోజూ ప్రశాంతం

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈమేరకు పదో తరగతి ఉదయం పరీక్షకు 733మందిలో 645మంది, మధ్యాహ్నం పరీక్షకు ఒకరికి ఒకరు హాజరయ్యారు. ఇక ఇంటర్మీడియట్ ఉదయం పరీక్షకు 933మందిలో 776మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు.

వచ్చేనెల 2 నుండి సదరమ్ క్యాంపులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వచ్చే నెల మే 2వ తేదీ నుండి 16వ తేదీ వరకు మూడు సదరమ్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఖమ్మం జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మే 2న వైరాలో, 9, 16వ తేదీల్లో ఖమ్మం ఆస్పత్రిలో క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో, మెడికల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు.

సాంకేతిక కోర్సుల్లో అనాథ మహిళలకు ప్రవేశాలు

ఖమ్మంగాంధీచౌక్: అనాథలు, నిరాశ్రయులైన ఆడపిల్లలు, అక్రమ రవాణా బాధితులు, బాలల సదనం, ఇతర మహిళా సంస్థల్లో ఆశ్రయం పొందుతున్న వారే కాక పాలిసెట్ రాయని వారికి సాంకేతిక శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సీహెచ్.సంధ్యారాణి తెలిపారు. అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టీసీ, స్టడీ, సర్టిఫికెట్, ఎస్సెస్సీ మెమో, తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీర్, కంప్యూటర్ ఇంజనీర్ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనుండగా, కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో వచ్చే నెల 10వ తేదీలోగా దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇంటర్మీడియట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్) ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన వారు క్లినికల్ శిక్షణ కోసం వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. ఖమ్మం ప్రభుత్వాస్పత్రి, అనుబంధ ఆస్పత్రుల్లో ఖాళీల ఆధారంగా ఏడాది పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారు రూ.వెయ్యి డీడీ అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో ఎంపిక కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యర్థులు బయోడేటా ఫారం, జిరాక్స్ ప్రతులు, రూ.10 పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా రాసిన కవర్‌తో తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

1న డీలర్ల సమావేశం

ఖమ్మం సహకారనగర్: వచ్చే నెల 1న ఉమ్మడి జిల్లా స్థాయి డీలర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు డీలర్ల జేఏసీ నాయకులు బానోతు వెంకన్న, ఊకే శేఖర్ తెలిపారు. డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం పోరాట కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ సమావేశం ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలోని వంశీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జూన్ 1నుంచి రేషన్‌షాపులు బంద్ చేయాలని నిర్ణయించిన నేపథ్యాన ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి డీలర్లు హాజరుకావాలని కోరారు.

పోస్టాఫీసుల్లో 'ఆసరా'

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే ఆసరా పెన్షన్లను పోస్టాఫీసుల ద్వారా చెల్లించనున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పోస్టాఫీసుల్లో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులకు ఆసరా పెన్షన్లు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు సమర్పించడం ద్వారా పింఛన్ తీసుకోవచ్చని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 521 పోస్టాఫీసులతో పాటు 52 మంది పోస్టుమ్యాన్ల వద్ద మైక్రో ఏటీఎంల ద్వారా కూడా నగదు తీసుకునే వెసలుబాటు కల్పించామని పేర్కొన్నారు.

'స్వచ్ఛ' పాఠశాలలకు పురస్కారాలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో స్వచ్ఛ విద్యాలయాలుగా ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈఓ సోమశేఖరశర్మ అవార్డులు అందచేశారు. కలెక్టరేట్‌లో బుధవారం అవార్డులు అందజేశాక ఆయన మాట్లాడుతూ మరింత కృషి, పట్టుదలతో పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. వేసవిలో పాఠశాలల్లో పైపులైన్లు, కిచెన్ గార్డెన్ల రక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. స్వచ్ఛ పురస్కార్ జిల్లా నోడల్ అధికారి, సీఎంఓ వై.రాజశేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్.రామకృష్ణ, ఏఎంఓ రవికుమార్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత పాల్గొన్నారు.



పార్టీల్లో ఆత్మీయ జోష్!

- ప్రజల్లో ఉండేలా.. కేడర్‌కు భరోసా కల్పించేలా అడుగులు
- ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్‌ఎస్ జోరు
- ఖమ్మం మినహా పూర్తయిన పొంగులేటి భేటీలు
- వరుస కార్యక్రమాలతో కాంగ్రెస్ కేడర్‌లో కదలిక
- యాత్రలతో ప్రజల్లోకి వెళ్లిన కమ్యూనిస్టులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా రాజకీయ పార్టీల నేతలు తమ కార్యక్రమాల్లో వేగం పెంచారు. పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేతలు.. ప్రజల్లో ఉంటూనే కేడర్‌లో ఉత్సాహాన్ని నింపేలా ముందుకు సాగుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాలు పూర్తికాగా.. బీఆర్‌ఎస్‌తో విభేదించిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలు ఖమ్మం మినహా తొమ్మిది నియోజకవర్గాల్లో పూర్తయ్యాయి. ఖమ్మం భేటీ నిర్వహిస్తే ఆయన ఏ పార్టీలో చేరేది తెలుతుందని చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ నాయకులు హాథ్ సే హాథ్ జోడో పేరుతో ప్రతీ నియోజకవర్గంలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తుండగా, ఖమ్మంలో నిరుద్యోగ నిరసన ర్యాలీ కూడా నిర్వహించి ఎన్నికల కదనరంగంలో దూకేందుకు సిద్ధమవుతున్నారు.

పొంగులేటి వైపు.. అందరి చూపు

బీఆర్‌ఎస్ పార్టీతో విభేదించిన మాజీ ఎంపీ పొంగులేటి ఈ ఏడాది జనవరి నుంచి వరుస కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. నియోజకవర్గాల వారీగా అనుచరులు, అభిమానులతో నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశాలు విజయవంతం కావడంతో ఆయన వర్గంలో ఉత్సాహం నెలకొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు తొమ్మిది నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తికాగా, ఖమ్మం మాత్రమే మిగిలింది. ఆతర్వాత ఆయన ఏ పార్టీలో చేరేది తేలుతుందని భావిస్తున్నారు. పొంగులేటి తీసుకునే నిర్ణయంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయ సమీకరణలు మారుతాయనే చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

కొద్దిరోజులుగా కాంగ్రెస్ స్పీడ్ పెంచింది. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీలోని ఆశావహులు తమ కార్యక్రమాలకు పదును పెట్టారు. అధిష్టానం పిలుపుమేరకు నియోజకవర్గాల వారీగా హాథ్‌సే హాథ్ జోడో యాత్రలు చేపట్టారు. రాష్ట్రప్రభుత్వం హామీలను విస్మరించిందని చెబుతూనే.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలను ప్రజలకు వివరించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కామేపల్లి మండలంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఇక టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిరుద్యోగ నిరసన దీక్షను కూడా రాష్ట్రంలోనే తొలిసారిగా ఖమ్మంలో నిర్వహించారు. మరోపక్క సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులు సైతం నేతలు ప్రజా చైతన్య యాత్ర, ప్రజాపోరుయాత్ర చేపట్టారు. అలాగే, బీజేపీ, వైఎస్సార్ టీపీ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీలు కూడా ప్రభుత్వ విధానాలపై నిరసన తెలుపుతూ ప్రజల్లోకి వెళ్తున్నాయి.

ఉత్సాహంగా గులాబీ దళం

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యాన ఆత్మీయ సమ్మేళనాలు పూర్తయ్యాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యాన ఈ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలతో కార్యకర్తల్లోనూ కొత్త ఉత్సాహం వచ్చింది. మరోపక్క మంత్రి పువ్వాడ 'వాడవాడకు పువ్వాడ' పేరిట ఖమ్మంలోని డివిజన్లకు వెళ్లి ప్రజలు సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. కాగా, బీఆర్‌ఎస్ ఆవిర్భావం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు పయనమయ్యారు.

ఆర్టిజన్ల సమ్మె విరమణ

- 'ఎస్మా' ప్రయోగించడంతో విధుల్లోకి...
- జిల్లాలో విధుల నుంచి ఏడుగురి తొలగింపు



ఖమ్మంలోని విద్యుత్ సర్కిల్ ఆపరేషన్ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లు చేపట్టిన సమ్మెను బుధవారం విరమించారు. ఆర్టిజన్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్లు రద్దు చేసి ఎక్సిస్టింగ్(ఏపీఎస్ఈబీ) సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, విద్యార్హత ఆధారంగా కన్వర్షన్లు ఇవ్వాలని తదితర డిమాండ్లతో మంగళవారం నుంచి సమ్మెకు దిగారు. ఇంతలోనే యాజమాన్యం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తున్నట్లు ప్రకటించింది. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్(హెచ్-82), ఈతేహైద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్‌తో పాటు పలు యూనియన్లు సమ్మెలో భాగస్వాములు కాగా, కొందరు ఆర్టిజన్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈమేరకు సమ్మెలో పాల్గొన్న ఆర్టిజన్లను గుర్తించి ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ బైండోవర్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో ఎన్పీడీసీఎల్ పరిధిలో 267 మంది ఆర్టిజన్లు పనిచేస్తుండగా, వీరిలో 18 మంది సమ్మెలో పాల్గొన్నట్లు అధికారులు గుర్తించారు. ఇక ట్రాన్స్‌కోలో 176 మంది ఆర్టిజన్లకు 119 మంది మంగళవారం సమ్మెలో పాల్గొనగా, 57 మంది విధులు నిర్వహించారు. ఈమేరకు సమ్మెలో పాల్గొన్న వారిని తొలగిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పలువురుప్రజాప్రతినిధులు విద్యుత్ సంస్థ సీఎండీ ప్రభాకర్‌రావుతో చర్చలు జరపగా, విధుల నుంచి తొలగించిన ఆర్టిజన్లను విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇవ్వగా నాయకులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఆర్టిజన్లు విధుల్లో చేరారు.

ఏడుగురిని తొలగిస్తూ ఉత్తర్వులు

ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్ పరిధిలో సమ్మెకు దిగిన వారిలో నలుగురు ఆర్టిజన్లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. ఇక ట్రాన్స్‌కో పరిధిలో 119 మంది సమ్మెలో పాల్గొనగా, తిరిగి విధుల్లో చేరారు. వీరిలో ముగ్గురి(సంఘాల నాయకులు)ని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. మొత్తంగా జిల్లాలో ఏడుగురు ఆర్టిజన్ల తొలగించగా, వీరిని తిరిగి విధుల్లో చేర్చాలని యూనియన్ల నాయకులు యాజమాన్యాన్ని కోరుతున్నట్లు తెలిసింది. కాగా, సమ్మెతో జిల్లాలో విద్యుత్ పంపిణీ, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తీసకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి.


రీజియన్‌కు నష్టాలు తగ్గాయి



మాట్లాడుతున్న ఆర్ఎం ఎస్తేర్ ప్రభులత

సత్తుపల్లిటౌన్: టీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌కు 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.111 కోట్ల నష్టం రాగా, గతేడాది 2022-23లో రూ.28 కోట్లకు తగ్గాయని రీజనల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత వెల్లడించారు. సత్తుపల్లిలో ఆర్టీసీ కండక్టర్లకు 'టాక్ట్' పేరిట ఇస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ ఆక్యుపెన్సీ రేషియో పెంచేలా కండక్టర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికుల ఆదరణతోనే సంస్థ మనుగడ ఆధారపడి ఉందన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ విషయమై వివిధ రంగాల నిపుణులతో ఇప్పిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం తెలిపారు. డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులందరూ బూస్టర్ డోస్ వేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వ్యాక్సిన్ మేనేజర్ రమణ

ఖమ్మం వైద్యవిభాగం: కరోనా వ్యాప్తి నేపథ్యాన అర్హులైన ప్రతీఒక్కరూ వ్యాక్సిన్ బూస్టర్ డోస్ వేయించుకోవాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్. రమణ సూచించారు. నగరంలోని మామిళ్లగూడెం, శ్రీనివాసనగర్ పట్టణ దవాఖానాల్లో బుధవారం వరల్డ్ ఇమ్యూనైజేషన్ వీక్ నిర్వహించారు. ఈసందర్భంగా రమణ పాల్గొని గర్భిణులు, బాలింతలకు వ్యాక్సిన్ ఆవశ్యకత, వడదెబ్బ జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, చిన్నారులను 12రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించేందుకు బుధ, శనివారాల్లో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఇక కరోనా వ్యాక్సిన్ బూస్టర్ డోస్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉందని చెప్పారు. ప్రస్తుతం ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. వైద్యులు నాగమణి, లోహిత, ఉద్యోగులు సంధ్య, బాబు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణ, విస్తీర్ణం పెంపు

పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్



రేంజ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్

అన్నపురెడ్డిపల్లి: పకడ్బందీ చర్యలతో అడవులను పరిరక్షిస్తూనే విస్తీర్ణం పెంచడంపై అటవీ ఉద్యోగులు దృష్టి సారించాలని అటవీ శాఖ కంపా విభాగం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) లోకేష్ జైస్వాల్ ఆదేశించారు. భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలోని రామవరం రేంజ్, అబ్బుగూడెం నర్సరీ, ప్లాంటేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించి అడవుల పరిరక్షణ, అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ప్లాంటేషన్, నర్సరీపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన అడవుల పరిరక్షణకు మరిన్ని చర్యలు చేపట్టడంతోపాటు వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు.

రేంజ్ కార్యాలయ ప్రారంభోత్సవం

చండ్రుగొండ: అంకితభావంతో విధులు నిర్వర్తించే మంచి అధికారి, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావును కోల్పోయామని పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్ అన్నారు. చండ్రుగొండలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిర్మించిన ఫారెస్ట్ రేంజ్ కార్యాలయా(చలమల శ్రీనివాసరావు భవనం)న్ని బుధవారం పీసీసీఎఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో భాగంగా శ్రీనివాసరావు ప్రాణాలు వదలడం దురదృష్టకరమన్నారు. ఇద్దరు దుండగుల ఘాతుకానికి ఫారెస్ట్ శాఖ మంచి అధికారిని కోల్పోయిందని పేర్కొన్నారు. శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకుని అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు.ఈకార్యక్రమాల్లో సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ లక్ష్మణ్‌రంజిత్ నాయక్, ఎఫ్‌డీఓ అప్పయ్య, ఎఫ్ఆర్ఓలు జి.ప్రసాదరావు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

రైతులూ.. అధైర్యపడకండి

- పంట నష్టపోయిన వారందరికీ పరిహారం చెల్లిస్తాం
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



దెబ్బతిన్న కౌలు రైతు వెంకటేశ్వర్లు వరి పొలంలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్



మేడేపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ముదిగొండ: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, నష్టం జరిగిన ప్రతీ ఒక్కరికి పరిహారం చెల్లిస్తామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ భరోసా కల్పించారు. ముదిగొండ మండలంలోని మేడేపల్లి, ముదిగొండల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మేడేపల్లిలో రైతులు సామినేని రమేష్, పోతునూక మధుసూదన్‌రావు మొక్కజొన్న చేన్లను పరిశీలించాక పెట్టుబడి, నష్టం తదితర వివరాలు తెలుసుకున్నారు. అలాగే, వడగండ్లతో నేలలో కలిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్ ఇవి తీయడానికి రావడం లేదా అని ఆరా తీశారు. అయితే, 70శాతం భూమిలోనే కలిసి పోగా, 30శాతమే చేతికందుతాయని రైతులు తెలిపారు. అనంతరం ముదిగొండలోని రైతులు ఉన్నం రవి, మల్లెల ఉపేందర్, గంధసిరి వెంకటేశ్వర్లు వరి పొలాలను కూడా కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు పరిహారం చెల్లిస్తామని కలెక్టర్ ధైర్యం చెప్పారు. ఈమేరకు సమగ్ర సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ రాధ పాల్గొన్నారు. కాగా, ముదిగొండలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తామ పొలాలకు వెళ్లేలా అండర్ పాస్ ఏర్పాటుచేయించాలని పలువురు రైతులు కలెక్టర్‌కు విన్నవించారు.

భూసేకరణ వేగవంతం చేయండి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఖమ్మం-దేవరపల్లి, నాగపూర్-అమరావతి, కోదాడ-ఖమ్మం, ఖమ్మం-కురవి హైవే పనులకు ఆటంకం ఎదురుకాకుండా భూసేకరణ చేయాలని, సీతారామ ఎత్తిపోతల పథకంపై కూడా దృష్టి సారించాలని తెలిపారు. కాగా, తహసీల్దార్లు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను తనిఖీ చేయాలని సూచించారు.

ఎన్నికల పనులు సకాలంలో పూర్తిచేయాలి

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సకాలంలో నిర్దేశిత పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన వీసీ ద్వారా కలెక్టర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారుల నియామకంపై ప్రతిపాదనలు పంపించాలని, ఈవీఎం, వీవీప్యాట్లను వీడియో రికార్డింగ్ నడుమ పరిశీలించాలని, ఎన్నికల విధులపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర, స్థాయి మాస్టర్ ట్రెయినర్లను ప్రతిపాదించాలని తెలిపారు. అలాగే, ఆరుగురి కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లలో మరోసారి తనిఖీ చేయాలని సూచించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, కేఎంసీ కమీషనర్ ఆదర్శ్ సురభి, జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దశరథం, తహసీల్దార్ శైలజ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్



జిల్లా జడ్జికి శుభాకాంక్షలు చెబుతున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఖమ్మం వచ్చారు. ఆయన 1984లో కోర్ట్ మార్షల్‌గా విధులు నిర్వర్తించగా, 1988లో మెజిస్ట్రేట్‌గా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో పనిచేశారు. అలాగే, కరీంనగర్ జిల్లా మంథనిలో సీనియర్ సివిల్ జడ్జిగా, అనంతపురం జిల్లా గుత్తిలో అడ్‌హాక్ జిల్లా న్యాయమూర్తిగా పనిచేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతిపై నిజామాబాద్ బదిలీ అయ్యారు. ఆతర్వాత నల్లగొండలో విధులు నిర్వర్తిసూ ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన జగ్జీవన్‌కుమార్ మాట్లాడుతూ పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే అదనపు జిల్లా న్యాయమూర్తిగా కె.ఉమాదేవి బాధ్యతలు స్వీకరించారు. కాగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జగ్జీవన్ కుమార్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్యతో పాటు ఉపాధ్యక్షుడు మాదిరాజు లక్ష్మీనారాయణ, కె.రాజశేఖర్ రెడ్డి, చుంచుల మల్లికార్జునరావు, పి.దానయ్య, ఇమ్మడి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో పూజలు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఖమ్మం జిల్లా జడ్జి జగజ్జీవన్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించాక స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయి బాబా, వేదపండితులు ప్రసాద్ పాల్గొన్నారు.

శాస్త్రీయంగా పంట నష్టం లెక్క

సర్వేలో నిమగ్నమైన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఈదురుగాలులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలతో జరిగిన పంట నష్టాన్ని శాస్త్రీయంగా గుర్తించే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. ఈనెల 21, 23వ తేదీల్లో కురిసిన వర్షంతో జిల్లాలోని వరి, మొక్కజొన్న, పెసర వంటి పంటలకు నష్టం వాటిల్లింది. ఈమేరకు 1,751 ఎకరాల్లో మొక్కజొన్న, 8,169 ఎకరాల్లో వరి, 28 ఎకరాల్లో పెసరకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. అయితే, రాష్ట్రప్రభుత్వం సమగ్ర సర్వే చేయాలని ఆదేశించడంతో అధికారులు రంగంలోకి దిగారు. అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులతో కూడిన బృందాలు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. పంట నష్టాల వివరాలు నమోదు చేశాక ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు.

వెయ్యి మెట్రిక్ టన్నుల దిగుమతి తప్పనిసరి



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

కల్లూరు/కల్లూరు రూరల్: ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ప్రతీ మిల్లుకు వెయ్యి మెట్రిక్ టన్నుల చొప్పున దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ సూచించారు. కల్లూరు డివిజన్ పరిధిలోని మిల్లర్లతో తాజాగా సమావేశమైన అధికారులు ఈమేరకు సూచనలు చేయగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. దీంతో అదనపు కలెక్టర్ బుధవారం కల్లూరు వచ్చి ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి సివిల్ సప్లయీస్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే, ప్రతీ మిల్లులో వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. మిల్లులకు వచ్చిన లారీలను నిలపకుండా ఎప్పటికప్పుడు దిగుమతి చేయించాలని, రైతులు వేచి ఉండకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్ఓ రాజేందర్, ఏడీఏ సరిత, ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఏడీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా రామయ్య నిత్యక్రతువు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి నిత్యకల్యాణ వేడుక బుధవారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశా రు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా బేడా మండపంలో స్వామి వారికి స్నపన తిరుమంజనం జరిపారు.

క్లుప్తంగా

పువ్వాడ నాగేశ్వరరావుకు పరామర్శ



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న తమ్మినేని, సుదర్శన్‌రావు, పక్కన మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావును బుధవారం పలువురు పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్, ఎంపీ కె.కేశవరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు తదితరులు పరామర్శించి ఆయన కుమారుడు, మంత్రి పువ్వాడ అజయ్‌తో ఆరోగ్య పరిస్థితిపై మాట్లాడారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం



దాతకు రశీదు ఇస్తున్న కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్‌లోని కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులో శ్రీ అంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ ఆలయ పునర్నిర్మాణానికి చావా రామ్మూర్తి – సుమిత్ర దంపతులు రూ.50,116 విరాళం ప్రకటించారు. ఈ నగదును బుధవారం ఆలయ కమిటీ బాధ్యులకు అందజేయగా వారు సన్మానించారు.

పీహెచ్‌సీలో కేంద్రబృందం



పాలేరు సబ్‌సెంటర్ వద్ద బృందం సభ్యులు

కూసుమంచి: కూసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు పాలేరులోని హెల్త్ సబ్‌సెంటర్‌ను బుధవారం కేంద్ర(ఎన్‌క్యూఎస్) బృందం సందర్శించింది. బృందం సభ్యులు వెంకటేష్, అనుషా పీహెచ్‌సీలో అందుతున్న సేవలు, కేంద్ర పథకాల అమలుతీరుపై అడిగి తెలుసుకున్నారు. పాలేరు హెల్త్ సబ్‌సెంటర్‌లో అక్కడ వైద్యంపై సిబ్బంది, ప్రజలతో మాట్లాడారు. అలాగే, కార్యక్రమాల అమలు ప్రగతిని సమీక్షించారు. అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంబాబు, వైద్యాధికారి కిషోర్, జిల్లా సభ్యులు డాక్టర్ బాలకృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు నిధి ఆప్ కే నిఖత్

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన గురువారం వైరా, పాల్వంచల్లో నిధి కే ఆప్ నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. వైరాలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంతో పాటు పాల్వంచలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంలో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

గౌరవప్రదంగా సీట్ల సర్దుబాటు

ఖమ్మంమయూరిసెంటర్: మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్న బీజేపీని ఓడించేందుకు వామపక్ష, లౌకిక శక్తులు ఐక్యంగా పోరాడాలని.. ఇందుకోసం వచ్చే ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్ నడుమ సీట్ల సర్దుబాటు గౌరవప్రదంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కూడా మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ అధికారాన్ని చేపట్టాలని బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. ఈమేరకు రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, ఎం.ఎ.జబ్బార్, దొంగల తిరుపతిరావు, ఎస్.కే.మీరా, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీను పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,675	1,640
పెసలు	7,010	3,500
కందులు	7,650	5,500
మిర్చి	23,050	18,000
మిర్చి తాలు	12,500	9,000
పత్తి	7,500	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,943

ఓసీకి ఓకే!

జేకే ఓసీ నిర్మాణానికి ప్రజామోదం

- మెరుగైన పరిహారం ఇవ్వాలని పలువురి వినతి
- సీఎస్సార్ నిధులను పక్కదారి పట్టించొద్దని డిమాండ్
- ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న నేతలు



అభిప్రాయ సేకరణకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ, వేదికపై అదనపు కలెక్టర్ తదితరులు

ఇల్లెందు: ఇల్లెందులో జేకే ఓసీ ఏర్పాటుకు స్థానిక 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సాఫీగానే సాగింది. ప్రజామోదం మేరకే ఓసీ ఏర్పాటు చేస్తామని, అందరి అభిప్రాయాలు సేకరిస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ముందే ప్రకటించారు. అయితే కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు.. జేకే ఓసీ విస్తరణ ప్రభావిత ప్రాంత నిర్వాసితులకు సకాలంలో మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మాట్లాడుతూ.. గతంలో జేకే 5 ఓసీలో నష్టపోయిన వారికి నేటికీ పరిహారం అందక అలమటిస్తున్నారని, ఈసారి ఏ ఒక్కరూ తమకు పరిహారం అందలేదనే భావన రావద్దని, బాధితులను సంపూర్ణంగా ఆదుకోవాలని సూచించారు. 21 ఏరియాలో 200 మంది నివాసం ఉంటున్నారని, సింగరేణి క్వార్టర్లలో ఉంటున్నారనే సాకుతో పరిహారం చెల్లించకుండా ఉండొద్దని అన్నారు. ఓసీని ప్రైవేట్ పరం చేయవద్దని, ఓసీ నీటిని సాగుకు మళ్లించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణంలో సింగరేణి సంస్థ నిబంధనలు ఉల్లంఘించవద్దన్నారు. అనుమతి లేకుండా ఏ పనీ చేపట్టవద్దన్నారు. నిర్వాసితుల, ఆయా ప్రాంతాల అభివృద్ధిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి ద్వారా లభించే సెస్‌ను ఎత్తివేసి డీఎంఎఫ్ నిధులను నిర్వాసిత ప్రాంతాల వెలుపల ఖర్చు చేస్తున్నారని అన్నారు. సింగరేణి పుట్టినిల్లయిన ఇల్లెందును ఓసీల పేరుతో బొందల గడ్డగా మారుస్తున్నారని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సింగరేణి పరిధిలో ఉన్న 22, 23 వార్డులను రెవెన్యూ శాఖకు అప్పగించాలని కోరారు. జేకే బస్ స్టాప్ నుంచి డీ బ్లాక్ వరకు డివైడర్ ఏర్పాటు చేసి రోడ్డు వెడల్పు చేయాలన్నారు. తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ ఓసీ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని, 1/70, పెసా చట్టాలను సైతం ఉల్లంఘించారని అన్నారు. ఓసీ పరిధిలోని ప్రజలను ఆహ్వానించకుండా చేపట్టిన ఈ అభిప్రాయ సేకరణను తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇంకా ఈ సభలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్. రంగనాథ్, ఏఐటీయూసీ నాయకులు కె. సారయ్య, ఎన్డీ రాష్ట్ర నాయకులు అవునూరి మధు , సీపీఎం నాయకులు నబీ, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, సిలివేరు సత్యనారాయణ, రాంసింగ్, రేపాకుల శ్రీనివాస్, ఆలేటి కిరణ్ తదితరులు మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ బి. రవీందర్, ఎన్విరాన్‌మెంట్ జీఎం జీవీఆర్ గణపతి, ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, జేకే ఓసీ పీఓ బొల్లం వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణ అధికారి పంజాల శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, తహసీల్దార్ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ అంకుషావలి తదితరులు పాల్గొన్నారు.

1114.507 హెక్టార్ల విస్తీర్ణంలో..

ప్రజాభిప్రాయ సేకరణలో మొదట సింగరేణి జీఎం షాలేమురాజు.. ఓసీ ఏర్పాటుకు పర్యావరణ అనుమతి కోరుతూ నివేదికను ప్రవేశపెట్టారు. రూ.297.88 కోట్లతో 1114.507 హెక్టార్ల భూమిలో 2.50 మిలియన్ టన్నుల బొగ్గు సేకరణ కోసం అనుమతి కోరుతున్నట్లు తెలిపారు. ఇల్లెందు మండలం రొంపేడు, సుదిమళ్ల, ఖమ్మం జిల్లాలోని సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలో ఓసీ నిర్మాణం చేపడతామని వివరించారు. అన్ని అనుమతులూ లభిస్తే ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

ఏన్కూరు ప్రమాద బాధితులకు పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలోని ఏన్కూరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరు అంబేద్కర్‌నగర్‌కు ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడి ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం పరామర్శించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావుతో చికిత్స మాట్లాడారు. క్షతగాత్రుల్లో ముగ్గురిని డిశ్చార్జి చేశామని, మిగిలిన వారికి చికిత్స అందిస్తున్నట్లు వారు తెలిపారు.

కూలీల మృతిపై ఎంపీ సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: ఏన్కూరు వద్ద జరిగిన ప్రమాదంలో కల్లూరుకు చెందిన ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందడంపై బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నాయకులు నామ నాగేశ్వరరావు సంతాపం ప్రకటించారు. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా ఆస్పత్రి వైద్యులను మాట్లాడినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

పొంగులేటి ఆర్థికసాయం

కల్లూరు: ఏన్కూరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కల్లూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన బీరవల్లి వెంకటమ్మ, వేము వరమ్మ కుటుంబాలను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందచేశారు. నాయకులు యాసా వెంకటేశ్వరరావు, కాటేపల్లి కిరణ్‌కుమార్, ఉబ్బన శ్రీనివాసరావు, దామాల సురేష్, కేవీఆర్, మాదాల వంశీకృష్ణ, వేము దినాకర్, ఆళ్ళకుంట నరసింహారావు పాల్గొన్నారు.

ఏడాది గడిచినా హామీలు అమలుకావు

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వరి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ముదిగొండ: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ అమలుచేయకుండా మోసం చేశారని.. ఇంకా ఏడాది గడిచినా ఆ హామీలు నెరవేరవని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ముదిగొండ మండలంలోని మేడేపల్లి, మాధాపురం, యడవల్లి, ముదిగొండల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బోనకల్ పర్యటనలో సీఎం కేసీఆర్ గంటల వ్యవధిలోనే రైతులకు నష్టపరిహారం అందజేస్తామని చెప్పి 47రోజులు గడిచినా అందలేదని పేర్కొన్నారు. ఈక్రమంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆతర్వాత అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను పరామర్శించిన ఆయన, ముదిగొండలోని తహసీల్ ఎదుట గ్రామదీపికలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ వాగదాని కన్నయ్య, నాయకులు మోర్తాల నాగార్జునరెడ్డి, జూలకంటి సంజీవరెడ్డి, వాక వెంకటేశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, రాఘవారెడ్డి, సోము అంకిరెడ్డి, కొండ రామారావు, వట్టికూటి సైదులుగౌడ్, కందుల రంగారావు, మరికంటి కృష్ణ, వెంకట్రావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు.. ముస్లింల హక్కు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కల్లూరు రూరల్: రిజర్వేషన్లు పొందడమనేది ముస్లిం, మైనార్టీల హక్కు కాగా, వీటిని రద్దు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పడం గర్హనీయమని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించగా, ఎందరో ఉన్నత చదువులు పూర్తిచేశారని తెలిపారు. ఈక్రమంలో తెలంగాణలో అధికారంలోకి వస్తే రిజర్వేషన్ రద్దు చేస్తామని అమిత్‌షా పేర్కొనడం గర్హనీయమని.. బీజేపీ మతతత్వ పాలన సాగిస్తోందని చెప్పడానికి ఆయన వ్యాఖ్యలే నిదర్శనమని మండిపడ్డారు. ఈసమావేశంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ కార్మిక దినోత్సవమైన మే డేను వారం పాటు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నేపథ్యాన ఐక్యతను చాటేలా మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టి.విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, నాయకులు నున్నా నాగేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీకాంత్, వై.విక్రమ్, బండారు యాకయ్య, విఠల్, పి.మోహన్‌రావు, పి.రమ్య పాల్గొన్నారు.

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి




కల్లాల్లో తడిసిన మొక్కజొన్నలను పరిశీలిస్తున్న సుధాకర్‌రెడ్డి, నాయకులు

బోనకల్/ఖమ్మం మామిళ్లగూడెం: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ, పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతలలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం ఏర్పాటుచేసిన బీజేపీ జిల్లా కోర్ కమిటీ సమావేశంతో పాటు ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైన రాష్ట్రప్రభుత్వం తీరును ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. అనంతరం అకాల వర్షాలతో కల్లాల్లో తడిచిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. తడిచిన మక్కలను మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, సీఎం కేసీఆర్ ప్రకటించిన పరిహారం అందకపోగా అర్హులైన రైతులకు జాబితాలో స్థానం దక్కక నష్టపోయారని తెలిపారు. ఈమేరకు ఎకరాకు రూ.10వేలు కాకుండా రూ.50వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక అకాల వర్షాలతో రైతులు పంట నష్టపోగా, ఆత్మీయ సమ్మేళనాలతో వినోదాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈసమావేశాల్లో మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు మందా సరస్వతి, కళ్లెం విజయరెడ్డి, దీకొండ శ్యాం, విక్రం జాదవ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి

తిరుమలలో దర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..



రంగయ్య (ఫైల్)

చింతకాని: మండలంలోని జగన్నాథపురానికి చెందిన రేషన్ డీలర్ మండెపూడి రంగయ్య(75) బుధవారం ఉదయం గుండెపోటుతో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమలలో మృతి చెందాడు. చింతకానికి చెందిన మిత్రుడు జాజాల చంద్రయ్యతో కలిసి రంగయ్య మంగళవారం ఉదయం తిరుపతి బయలుదేరిన ఆయన రాత్రి తిరుపతిలో దిగాక అర్ధరాత్రి 1.15 గంటలకు తిరుమల చేరుకున్నారు. బుధవారం ఉదయం చంద్రయ్య గది కోసం జీఎంసీ కౌంటర్ వద్దకు వెళ్లిన ఆయన రంగయ్యకు ఫోన్ చేసేసరికి అప్పటికే గుండెపోటుతో కుప్పకూలినట్లు పక్కనే ఉన్న భక్తులు సమాచారం ఇచ్చారు. దీంతో చంద్రయ్య చేరుకుని అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తీసుకెళ్లే సరికి రంగయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈవిషయాన్ని గ్రామంలోని కుటుంబీకులకు సమాచారం తెలపగా వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆయన మృతదేహం అర్ధరాత్రి స్వగ్రామానికి చేరే అవకాశముందని తెలిపారు. కాగా, రంగయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉండగా భార్య ఐదేళ్ల క్రితం, పెద్దకుమారుడు రెండేళ్ల క్రితం మృతి చెందారు.

రామయ్యకు రెండు గరుడ వాహనాలు



గరుడ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం ఇత్తడి వాహనాలు బహూకరించారు. సుమారు రూ.2.90 లక్షల విలువైన రెండు గరుడ వాహనాలను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వాహనాలను స్వామివారి ఉత్సవ మూర్తుల వద్ద ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అధికారులు అందజేశారు.

ద్విచక్ర వాహనాల చోరీపై విచారణ

ఖమ్మంలో నిందితుడి అరెస్టుతో వెలుగులోకి వివరాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గుర్రాలకుంట గ్రామపంచాయతీ పరిధి టేకుల తండాలో ద్విచక్ర వాహనాల చోరీ కేసులపై ఖమ్మం పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. కొద్దిరోజుల క్రితం ఖమ్మంలో ఓ వ్యక్తిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరపగా పెద్దసంఖ్యలో ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. ఆతర్వాత వాహనాలను టేకులతండాలో అమ్మినట్లు చెప్పగా ఐదు రోజుల క్రితం ఖమ్మం పోలీసులు నిందితుడిని తండాకు తీసుకొచ్చి విచారణ జరిపారు. వాహనాలను కొనుగోలు చేసిన వారు స్వచ్ఛందంగా అప్పగించాలని తండావాసులను సూచించారు. దీంతో బుధవారం నాలుగు వాహనాలను ప్రధాన రహదారి వద్ద వదిలి వెళ్లగా పోలీసులు స్వాధీనం చేసుకుని ఖమ్మం తరలించారు. కాగా, ఖమ్మం పోలీసులు స్వాధీనం చేసుకున్న నాలుగు స్ప్లెండర్ వాహనాలు ఏపీ రిజిస్ట్రేషన్‌తో ఉన్నాయి. నిందితుడి వద్ద పలువురు వాహనాలు కొనుగోలు చేసి నాటుసారా సరఫరా చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యాన పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని స్థానికులు కోరారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

ఖమ్మం సహకారనగర్: ఇటీవల అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో కల్లాల్లో పోసిన రాశులు వర్షానికి తడిచాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో రైస్‌మిల్లర్లు ధర తగ్గించి రైతులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఐదెకరాల మొక్కజొన్న చేను దగ్ధం

బోనకల్: మండలంలోని చిరునోముల రెవెన్యూ పరిధిలో ఐదె ఎకరాల మొక్కజొన్న చేను బుధవారం దగ్ధమైంది. చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన రైతు కొనకంచి నాగరాజు పది ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగుచేశాడు. చేను పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైరు తెగి పడడంతో మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకునేలోగా ఐదెకరాల్లో పంట దగ్ధమై రూ.2.50లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు వెల్లడించాడు.

గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు



మృతి చెందిన ఆనందరావు(ఫైల్)



ప్రమాదంలో పల్టీ కొట్టిన ట్రాక్టర్

పెనుబల్లి: గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుండి లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడగా ఒకరు మృతి చెందడంతో పాటు ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద బుధవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బయ్యన్నగూడెంకు చెందిన రైతు పామర్తి కృష్ణ తన పశువుల కోసం సత్తుపల్లి సమీపాన రామానగరం నుండి ట్రాక్టర్‌లో గడ్డి తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో లంకపల్లి వద్ద లారీ వెనుక నుండి ట్రాక్టర్‌ను ఢీకొట్టిందద్యీ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ పామర్తి కృష్ణతో పాటు ఆరుగురు కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన పామర్తి కృష్ణ, కూలీ కిన్నెర ఆనందరావు(45)ను ఖమ్మం తరలించారు. వీరిలో కిన్నెర ఆనందరావు ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. క్షతగాత్రులందరూ బయ్యన్నగూడెం పంచాయతీ పరిధిలోని నాయకులగూడెం వాసులని స్థానికులు తెలిపారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం



ఘటనాస్థలిలో బోల్తా పడిన డీసీఎం

కూసుమంచి: సూర్యాపేట – ఖమ్మం జాతీయ రహదారిపై లోక్యాతండా వద్ద వెళ్తున్న లారీని వెనుక నుండి డీసీఎం ఢీకొట్టిన ఘటనలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణా జిల్లా నూజివీడు నుండి టమాటాల లోడ్‌తో బుధవారం తెల్లవారుజామున హైదరాబా ద్ వెళ్తున్న డీసీఎం.. ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీ ఎం క్యాబిన్ నుజ్జునుజ్జయి బోల్తా పడగా టమాటాల బాక్స్‌లు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనలో డ్రైవర్ శంకర్‌కు తీవ్ర గాయాలు కాగా, క్యాబిన్‌లో ఉన్న డీసీఎం యజమాని కుమారుడు అభిషేక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో కూసుమంచి పోలీసులు, 108 సిబ్బంది చేరుకుని శంకర్, అభిషేక్‌ను క్యాబిన్ నుండి బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, డీసీఎం డ్రైవర్ శంకర్ నిర్లక్ష్యం, అతివేగంతోనే ఘటన జరిగిందని ఖమ్మంకు చెందిన కూరగాయల వ్యాపారి తోట రామారావు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.